క్లుప్తంగా

ముత్యాలమ్మకు గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా నాల్గో రోజు శుక్రవారం అష్టోత్తర శత కలశాలతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి దంపతులతో కూడిన ఆలయ కమిటీ నేతృత్వంలో గ్రామోత్సవం శాస్త్రోక్తంగా, వేదోక్తంగా నిర్వహించారు. అవతార ఆవిర్భావ అంశాలను ఈ సందర్భంగా కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్ వివరించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని సాయంత్రం 108 దంపతులచే శివ పార్వతుల శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ ప్రక్రియ, మంత్రార్థాలు, శివ పార్వతుల కల్యాణ వ్యాఖ్యానం బ్రహ్మచారి శ్రీవిద్యా శంకరానంద స్వామి భక్తులకు వివరించారు.

స్వయం ఉపాధి ఇంటర్వ్యూలకు 219 మంది హాజరు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో, బ్యాంక్ అధికారులు

లింగపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలకు 219 మంది లబ్ధిదారులు హాజరయ్యారు. వీరికి లింగపాలెం ఎంపీడీవో కె.వాణి, లింగపాలెం ఎస్‌బీఐ బ్యాంక్ ఫీల్డ్ అసిస్టెంట్, లింగపాలెం గోదావరి గ్రామీణ చైతన్య బ్యాంక్ మేనేజర్ దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులతో పలు యూనిట్లకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. శనివారం ధర్మాజీగూడెం బ్యాంక్ పరిధిలో ఉన్న గ్రామాలలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పారిజాతగిరిలో ఉగాది వేడుకలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం శ్రీవిశ్వా వసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10:30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులచే పంచాంగ శ్రవణం నిర్వహిస్తామన్నారు. అనంతరం గత సంవత్సర కాలంగా ప్రతి శనివారం ఆలయంలో నిర్వహించే అన్న ప్రసాద వితరణకు సహకరించిన దాతలకు విశేష ఆశీర్వచన కార్యక్రమం చేస్తామమని తెలిపారు.

ఘనంగా సువర్చలా హనుమద్ కల్యాణం



మద్ది క్షేత్రంలో సువర్చలా హనుమద్ కల్యాణం చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆలయంలో సువర్చలా హనుమద్ కల్యాణం శుక్రవారం నిర్వహించారు. ఆలయ మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై, మంగళ వాయిద్యాల నడుమ శ్రీస్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి, అర్చక స్వాములు వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.

అపరాల రైతులకు సబ్సిడీపై పైప్‌లు

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని అపరాలు సాగు చేసే రైతులకు నీటి తడిపెట్టుకునేందుకు వీలుగా 50 శాతం రాయితీపై పీవీసీ పైప్‌లు అందిస్తున్నామని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు. 3 అంగుళాల నల్ల పైపులకు రూ.15,524, తెల్ల పైపులకు రూ.23,856 రైతు వాటాగా చెల్లించాలన్నారు. బయో టెక్నాలజీ అకౌంట్ నెంబర్‌కు ఫోన్‌పే ద్వారా చెల్లించి సంబంధిత పేమెంట్ రశీదు, పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో రైతుసేవా కేంద్రంలో సిబ్బందికి అందజేయాలన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో సొమ్ము చెల్లించిన వారికి కావాల్సిన పైప్‌లను కంపెనీ ద్వారా అందిస్తామన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో సొమ్ము చెల్లించిన రైతులకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. వివరాలకు రైతుసేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ముస్లింల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ కృషి



ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేస్తున్న విజయరాజు



కంభం విజయరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

చింతలపూడి: ముస్లింల అభివద్ధికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని చింతలపూడి నియోజకవర్గ సమన్వయ కర్త కంభం విజయరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం చింతలపూడిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రంజాన్ ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో విజయరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జామియా మసీదు కమిటీ సభ్యులు కేంద్రం తీసుకురానున్న వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు వ్యతిరేకించాలని విజయరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని విజయరాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంజుమన్ మహఫిజుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాబు, కార్యదర్శి ఎండీ జిలాని, ఎండీ అక్బర్ అలి, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు సీహెచ్ జ్ఞానారెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వర్రావు, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు ఎం.దిలీప్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.చందీప్రియ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.ఇమ్మానియేలు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు వడిత్య కోట్లు, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షులు ఎం గురుబ్రహ్మం, మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ గుత్తా కిషోర్, సయ్యద్ హాజీ, ఖాజా మొయినుద్దీన్, జి.రాజేష్ నాయుడు, వెంపా కృష్ణ, ఎస్.దుర్గారావు, రామరాజు నాయక్, బండారు గోపి, పాల్గొన్నారు.

ఇక్బాల్‌కు పరామర్శ

ఇటీవల అనారోగ్యానికి గురైన పట్టణ ముస్లిం మైనారిటీ పెద్ద ఇక్బాల్‌ను కంభం విజయరాజు శుక్రవారం పరామర్శించారు. ఇక్బాల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొప్పుల నాగేశ్వరరావు, ఎ.సుబ్బారావు, ముళ్లగిరి ఇమ్మానియేలు, నాయకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటు



పైప్‌లైన్ వేయిస్తున్న సర్పంచ్ కృష్ణ కుమారి

లింగపాలెం: మండలంలోని కొత్తపల్లి గ్రామం బీసీ కాలనీలో డ్రెయినేజీ కాలువ పూడుకుపోయి మురుగు నీరు ఆగిపోయింది. విషయం తెలుసుకున్న కొత్తపల్లి సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి సత్యనారాయణ వెంటనే స్పందించి పైప్‌లైన్ ఏర్పాటు చేసి డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి, సత్యనారాయణ, సెక్రెటరీ పాపారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ ఎలిసా, ఎస్సై చెన్నారావు

కామవరపుకోట: మండలంలో తడికలపూడి గ్రామం లూర్దుమాత కొండపై ఉన్న గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చాంపియన్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విన్నర్లకు శుక్రవారం మండల తహసీల్దార్ గద్దం ఎలిసా, తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. విజేతల్లో మొదటి బహుమతి ఏలూరు సూపర్ కింగ్స్‌కి ట్రోఫీతో పాటు రూ.33,333 నగదు, రెండో బహుమతి మేదంద్రుపాలెం వారికి ట్రోఫీతో పాటు రూ.22,222 నగదు, మూడో బహుమతి పూళ్ల సోల్జర్స్‌కి ట్రోఫీతో పాటు రూ.15,555 నగదు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ దోమతోటి నతానియేల్, బొంతు వెంకటేశ్వరరావు, మెరుగు సుందర్రావు, మొట్టికాయల నాగయ్య, వంగపండు శ్రీను, నల్లారి సత్తిబాబు, మోటేపల్లి రామకృష్ణ, కరటూరి గంగాద్రిప్రసాద్, మెరుగు హరిబాబు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ పునర్ వైభవ ప్రతిష్ఠకు ఐక్యంగా కృషి చేస్తామని నూతనంగా నియమింపబడిన మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజుతో సహా మరో ఆరుగురు నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్‌నగర్‌లోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద శుక్రవారం యువజన నాయకుడు నూకల రాము ఆధ్వర్యంలో పార్టీలో నూతనంగా పదవులు పొందిన వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, 10 నెలల కాలంలో ప్రజలు విసుగుచెంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజల మద్దతుతో వైఎస్సార్‌సీపీని ముందుకు తీసుకెళ్లి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయటమే లక్ష్యంగా సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పదవులు పొందిన దాసరి విష్ణు, తోట జయబాబు, గొడ్డటి నాగేశ్వరరావు, ఏలేటి చంద్రం, ఎస్‌కే బాజీ, డాక్టర్ ఉందుర్తి శ్రీను, గంటా శ్రీను, ఏలేటి చంద్రం, దూలపల్లి కాంతారావులను పూలమాలతో అభినందించారు.

విజయదుర్గమ్మకు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ ఆలయంలో కొలువైన పంచభూత మరకత లింగేశ్వర సహిత విజయదుర్గమ్మకు పల్లకీసేవ నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని మేళతాళాలతో పట్టణ పురవీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాడా రామ్మోహనరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్,ఉదయ్‌కుమార్, అర్చకులు వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ అమలుకు పోరాటం చేయాలి



మాజీ ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుట్టాయగూడెం: ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు పదవులు పొందిన కొయ్యలగూడెం మండల నాయకులు శుక్రవారం సాయంత్రం బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులోని మాజీ ఎమ్మెల్యే బాలరాజు క్యాంప్ కార్యాలయంలో వారు బాలరాజు, రాజ్యలక్ష్మిలను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసేవారికి వైఎస్సార్‌సీపీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీపీ గంజిమాల రామారావు, నాయకులు గంటా శ్రీను, దూలపల్లి కాంతారావు, మంతెన సోమరాజు, ఎస్‌కే బాజీ, చిడిపి రవి, నూకా రాము, ఏలేటి చంద్రం, తోటా జయబాబు, చిట్టియ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు

టి.నరసాపురం: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పాడైన చేతిపంపులు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. మండలంలో ఉపాధి కూలీలకు ఉపాధి పనులు కల్పించి, త్వరితగతిన మేట్‌లను నియమించాలన్నారు. గండిగూడెం, బొర్రంపాలెం, టి.నరసాపురం పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గుంతలు వెంటనే పూడ్పించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కాలనీల్లో 3 నుంచి 20 సెంట్ల స్థలం ఉంటే ఉచితంగా ప్రభుత్వం సోలార్ విద్యుత్ అందిస్తుందన్నారు. హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలతో పాటు అదనంగా ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, కొండల్లో ఉండే గిరిజనులకు రూ.లక్ష మంజూరు చేస్తుందని లబ్ధిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మి, ఎంపీడీఓ జి.మణి కుమారి, తహసీల్దార్ టి.సాయిబాబా ఆయా శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి

జంగారెడ్డిగూడెం: బాలికలు చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్లో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించే పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం న్యాయస్థాన ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కిషోర్ కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముళ్ళపూడి శ్రీనివాస్, న్యాయవాదులు అచ్యుత శ్రీనివాసరావు, ఏవీవీ భువనేశ్వరి, యు.ఏసుబాబు, జీవీవీ శేఖర్, బల్లే సాయికుమారి, తొర్లపాటి శ్రీనివాసరావు, బి.లతాకుమారి, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

బుట్టాయగూడెం: పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాలు, క్రైస్తవ సంఘాలు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు సరియం రామ్మోహన్‌రావు, తెల్లం రామకృష్ణ, జోసఫ్‌లు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ పాయం రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో మొడియం నాగమణి, మడకం రామారావు, కూరం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల శాంతి ర్యాలీ

కొయ్యలగూడెం: పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మశాంతి కోసం శుక్రవారం రాత్రి కొయ్యలగూడెంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. టీఎస్ స్నేహన్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణం హత్య అని పోస్టుమార్టం రిపోర్ట్ తేలిన వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. పాస్టర్ జాన్ విక్టర్ మాట్లాడుతూ చర్చల మీద, పాస్టర్ల మీద దౌర్జన్యాలపై ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బొగ్గవరపు బాబూరావు, పాస్టర్ల బృందం సభ్యులు పాలన్న, జీవన్బెం, గిమెన్ ఎలీషా, రాజేశ్వరరావు. రాజవరం గ్రామం సర్పంచ్, ఏలేటి చిన్న తుక్కయ్య పాల్గొన్నారు.

సింహ వాహనంపై నూకాలమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ వార్షిక ఉగాది జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగో రోజు శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా నిత్యపూజలు, మూలవిరాట్‌కు పంచామృత, పుణ్య నదీ జలాలతో, విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎస్ ధనకుమార్ శక్తితత్వంపై ప్రవచనం చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు తాండ్రపాపారాయుడు సెంటర్ రామాలయం నుంచి ప్రత్యేక సింహ వాహన రథంపై నూకాలమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), వెంకట రామలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. శ్రీభక్తాంజనేయ స్వీట్స్ అధినేత గుబ్బల రాంబాబు, లక్ష్మి దంపతులు 25 కేజీల పంచదార బూందీ, కిలపర్తి సుబ్బారావు, నాగ రమాదేవి దంపతులు 25 కేజీల లడ్డు అమ్మవారికి సమర్పించారు. వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. నూకాంబికా మహిళా సేవా భక్త బృందం, యువత, ఆలయ కమిటీ విశేషంగా చేసిన కృషితో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

బందకట్టు డ్యాంను అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతానికే ఒకప్పుడు జలసిరిగా ఉన్న బందకట్టు డ్యాం అధ్వానంగా మారిందని, అభివృద్ధి పనులు చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పీడబ్ల్యూడీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొయ్యలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బందకట్టు డ్యాం నుంచి వచ్చే నీరు పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాల్లో సుమారు 150 సాగునీటి చెరువులకు నీరు అందేదని అయితే ఇప్పుడు ప్రాభవం కోల్పోయిందనీ ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా ఏఈ భాస్కరరావును ఆదేశించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్టా వనజా లక్ష్మి, విప్ గంటా శ్రీనివాస్ వివిధ ప్రభుత్వ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నందీశ్వరుడి దర్శనానికి అనుమతి ఇవ్వాలి

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్యలో ఉన్న మహానందీశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించాలని పోలవరం గ్రామస్తులు కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు దిగువన ఈ దేవాలయం ఉండటంతో గత కొన్నేళ్లుగా ఈ దేవాలయానికి భక్తులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలో పోలవరం శివారున పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి లోపలికి ఎవరికీ అనుమతి ఇవ్వడం లేదు. దీంతో భక్తులు అక్కడ వరకు వచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కార్తీకమాసం, పర్వదినాలు, సెలవు దినాల్లో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు, భక్తులు ఈ క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వస్తుంటారు. ప్రాజెక్టు నిర్మాణానికి పూర్వం ఈ దేవాలయానికి నేరుగా భక్తులు వెళ్లి వచ్చేవారు. సుమారు 800 సంవత్సరాలకు పూర్వం చోళులు, పల్లవుల కాలంలో నిర్మించిన పురాతన దేవాలయం. దూప దీప నైవేద్యాలు నిర్వహించే అర్చకులకు కనీస ఆదాయం కూడా కొరవడింది. దేవదాయ, ధర్మదాయ శాఖ ఈ దేవాలయానికి అర్చకుడిని ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

టి.నరసాపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా నిర్వహించే ప్రచార జాత కార్యక్రమం శుక్రవారం టి.నరసాపురం, బందంచర్ల, కేతవరం, అల్లంచర్ల రాజు పాలెం, కొత్తగూడెం గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా టి.నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో కృష్ణ చైతన్య ప్రచార జాతాను ఉద్దేశించి మాట్లాడారు. భారత దేశంలో బ్యాంకుల జాతీయీకరణ, భూ సంస్కరణల చట్టం ద్వారా లక్షలాది ఎకరాల భూమి పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కుంచె వసంతరావు, కంచర్ల గుర్వయ్య, బీఎస్ సాగర్, తొర్లపాటి బాబు, తాడిగడప జయరాజు, వీరంకి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి చేరుకున్న ప్రచార యాత్ర

చింతలపూడి: ప్రజా సమస్యలపై సీపీఐ విశేషంగా పోరాడిందని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఈ నెల 23 భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార యాత్ర శుక్రవారం చింతలపూడికి చేరింది. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రచార యాత్ర పట్టణంలో బోసుబొమ్మ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా రేచర్ల, ఎర్రగుంటపల్లి, మల్లాయగూడెం, సమ్మేటివారిగూడెం మీదుగా పాత చింతలపూడిలో ముగిసింది. ఈ సందర్భంగా మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నష్టపోయిన రైతాంగానికి రూ.40 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగం అచ్యుత్, పి.శివకుమార్, ఎం.క్రాంతికుమార్, తొర్లపాటి రాజు, కంచర్ల గురవయ్య, పుల్లారి సోమశేఖర ఆచార్యులు, తుర్లపాటి బాబు, దొంతా కృష్ణ, జంగా రామచంద్రారెడ్డి, ఎస్‌కే కాలేషా, ఎస్‌కే మస్తాన్, ఎస్కే జానీ, చేపల్లి శ్రీనివాసరావు, తక్కెలపాటి ప్రసాదరావు, తాడిగడప మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు వాలీబాల్ టోర్నమెంట్

జంగారెడ్డిగూడెం: పట్టణంలో శ్రీకాసర నర్సిరెడ్డి కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 29, 30 తేదీల్లో పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి తిప్పాబొట్ల రామకృష్ణ తెలిపారు. టోర్నమెంట్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7 వేలు, మూడో బహుమతిగా రూ.4 వేలతోపాటు షీల్డ్ అందించనున్నారు. కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని ట్రస్ట్ కార్యక్రమాల్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

టి.నరసాపురం: గ్రామ దేవత ఆర్ల ముత్యాలమ్మ ఆలయ 11వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ఉగాది రోజున పొంగలి సమర్పిస్తామని, అలాగే ఒకటో తేదీ మంగళవారం అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



మహాలక్ష్మి అమ్మవారు

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరంలో మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉగాది పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, తొలి రోజు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించినట్లు చెప్పారు.